దేశ ఎగుమతి అధోగతి

ఆగస్టులో 13 నెలల కనిష్ఠానికి క్షీణత
34.71 బిలియన్ డాలర్లకు పరిమితం
10 నెలల గరిష్ఠానికి వాణిజ్య లోటు
రెండింతలైన బంగారం దిగుమతులు



గత ఆర్థిక సంవత్సరం (2023-24) దేశంలోకి బంగారం దిగుమతులు 30 శాతం పెరిగి 45.54 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-ఆగస్టులోనే 22.70 బిలియన్ డాలర్లకు చేరిక.

దేశంలోకి జరుగుతున్న పసిడి దిగుమతుల్లో దాదాపు 40 శాతం స్విట్జర్లాండ్ నుంచే. తర్వాతి స్థానాల్లో యూఏఈ (16 శాతానికిపైగా), దక్షిణాఫ్రికా (10 శాతం).

భారతీయ దిగుమతుల్లో బంగారం వాటానే 5 శాతానికిపైగా ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా బంగారం వినియోగంలో చైనా తర్వాత భారత్‌దే రెండో స్థానం. ఆభరణాల పరిశ్రమ నుంచి పెద్ద ఎత్తున ఆదరణ కనిపిస్తున్నది.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: దేశీయ ఎగుమతులు దారుణంగా పడిపోయాయి. గత నెలలో ఏకంగా 9.3 శాతం క్షీణించాయి. గడిచిన 13 నెలల్లో ఈ స్థాయిలో పతనం కావడం ఇదే తొలిసారి. ఆగస్టులో ఆయా దేశాలకు భారత్ నుంచి జరిగిన ఎగుమతుల విలువ 34.71 బిలియన్ డాలర్లకే పరిమితమైంది. మరోవైపు వివిధ దేశాల నుంచి భారత్‌కు వచ్చిన దిగుమతుల విలువ 3.3 శాతం పెరిగి 64.36 బిలియన్ డాలర్లకు ఎగిసింది. ఇది రికార్డుస్థాయి కావడం గమనార్హం. దీంతోనే వాణిజ్య లోటు సైతం 10 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 29.65 బిలియన్ డాలర్లను తాకింది. ఈ మేరకు మంగళవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

వెల్లువలా పసిడి-వెండి

ఆగస్టులో దేశంలోకి పసిడి, వెండి దిగుమతులు పెద్ద ఎత్తున జరిగాయి. వీటిలో బంగారం విలువ 10.06 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే నెలలో 4.93 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. అలాగే వెండి దిగుమతులు 727 మిలియన్ డాలర్లకు ఎగిశాయి. నిరుడు 159 మిలియన్ డాలర్లే. దీంతో దేశీయ దిగుమతులు మొత్తంగా పెరగడానికీ ఇవి దోహదం చేశాయి. నిజానికి దేశీయ దిగుమతుల్లో క్రూడాయిల్ వాటానే ఎక్కువ. దేశ ఇంధన అవసరాల్లో 80 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. కానీ పెట్రోలియం ధరలు తక్కువగా ఉండటంతో ముడి చమురు దిగుమతులు ఈ ఆగస్టులో 11 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. క్రిందటి ఏడాది ఆగస్టుతో చూస్తే ఇది 32.38 తక్కువ. కానీ ఇదే స్థాయిలో బంగారం, వెండి దిగుమతులుండటం.. ఈసారి వాణిజ్య లోటును ఎగదోసింది. అయితే కస్టమ్స్ సుంకాల కోత, పండుగ సీజన్ డిమాండ్ వల్లే ఈ స్థాయిలో గోల్డ్, సిల్వర్ ఇంపోర్ట్స్ జరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అంటున్నది. కస్టమ్స్ సుంకాల తగ్గింపు.. స్మగ్లింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలను తగ్గుముఖం పట్టేలా చేసిందని వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్ వాల్ చెప్పున్నారు. ఈ ఏడాది జూలైలో ప్రకటించిన కేంద్ర బడ్జెట్‌లో సుంకాన్ని 15 శాతం నుంచి 6 శాతానికి దించిన సంగతి విదితమే.

సరిహద్దుల్లో కుస్తీ.. వాణిజ్యంలో దోస్తీ అన్నట్టుగా చైనాతో కేంద్ర ప్రభుత్వం వైఖరి సాగుతున్నది. గత నెల చైనాకు భారత్ నుంచి ఎగుమతులు 22.44 శాతం పతనమై 1 బిలియన్ డాలర్లకు పరిమితమైతే.. చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 15.55 శాతం పెరిగి 10.8 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఏప్రిల్-ఆగస్టు మధ్య చైనాకు భారతీయ ఎగుమతులు గతంతో చూస్తే 8.3 శాతం దిగజారి 5.8 బిలియన్ డాలర్లుగానే ఉన్నాయి. కానీ చైనా నుంచి భారత్‌కు దిగుమతులు 10.96 శాతం ఎగబాకి 46.65 బిలియన్ డాలర్లను తాకాయి. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య లోటు 35.85 బిలియన్ డాలర్లుగా ఉన్నది. 2013-14 నుంచి 2017-18 వరకు అలాగే 2020-21లో యాయి. ఇదే సమయంలో యూఏఈ, స్విట్జర్లాండ్, కొరియా, జపాన్, థాయిలాండ్, వియత్నాం, తైవాన్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరిగాయి. మొత్తానికి అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, ఎర్ర సముద్రం సంక్షోభం.. భారతీ ఎగుమతుల్ని దెబ్బతీశాయని కేంద్రం తాజా పరిస్థితులను వెనకేసుకొస్తున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరగడం.. దేశీయ తయారీ రంగాన్ని వెక్కిరిస్తోందని పలువురు ఆర్థిక నిపుణులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చైనాతో చెట్టాపట్టాల్

భారత్‌కు చైనానే అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ఇక అమెరికా, యూఏఈ, సింగపూర్, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, నేపాల్, బెల్జియం, టర్కీ దేశాలకూ భారత్ నుంచి ఎగుమతులు గత నెల పడిపోయాయి. ఇదే సమయంలో యూఏఈ, స్విట్జర్లాండ్, కొరియా, జపాన్, థాయిలాండ్, వియత్నాం, తైవాన్ దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరిగాయి. మొత్తానికి అంతర్జాతీయ ఆర్థిక మందగమనం, ఎర్ర సముద్రం సంక్షోభం.. భారతీ ఎగుమతుల్ని దెబ్బతీశాయని కేంద్రం తాజా పరిస్థితులను వెనకేసుకొస్తున్నప్పటికీ, ఇతర దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరగడం.. దేశీయ తయారీ రంగాన్ని వెక్కిరిస్తోందని పలువురు ఆర్థిక నిపుణులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ట్రయంఫ్ సరికొత్త బైకులు

ధరల శ్రేణి రూ.2.17-2.40 లక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: ప్రముఖ వాహన సంస్థ బజాజ్ ఆటో..ప్రీమియం మోటార్‌సైకిళ్ల బ్రాండ్ ట్రయంఫ్‌ను మరింత బలోపేతం చేయడానికి మరో రెండు మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 400 సీసీ సెగ్మెంట్‌లో విడుదల చేసిన స్పీడ్ టీ4 మాడల్ ధర రూ.2.17 లక్షలుగాను, మై25 స్పీడ్ 400 మాడల్ ధర రూ.2.40 లక్షలుగా నిర్ణయించింది. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. స్టైలిష్, పనితీరు, టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ..యువతను దృష్టిలో పెట్టుకొని ఈ బైకు వేగాన్ని మరింత పెంచినట్లు బజాజ్ ఆటో ప్రెసిడెంట్ ఉనిత్ సుమీత్ నారంగ్ తెలిపారు. ట్రయంఫ్ బ్రాండ్‌ను మరింత బలోపేతం చేయడానికి డీలర్ల సంఖ్యను ఈ ఏడాది చివరినాటికి 170కి, అలాగే వచ్చే ఏడాది 200కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. బ్రిటన్‌కు చెందిన మోటార్‌సైకిల్ బ్రాండ్ ట్రయంఫ్‌తో గతేడాది జతకట్టిన విషయం తెలిసిందే. చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో కూడా డీలర్లను నెలకొల్పనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం 75 నగరాల్లో 120 డీలర్లు ఉన్నారు.

రిలయన్స్ డిజిటల్‌లో ఐఫోన్ 16

హైదరాబాద్, సెప్టెంబర్ 17: రిలయన్స్ డిజిటల్ స్టోర్లలో ఐఫోన్ 16 అన్ని రకాల మాడళ్లు లభిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్టోర్లతోపాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలో కూడా ఈ ఫోన్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. ఈ ఫోన్లను ముందస్తు బుకింగ్ చేసుకున్నవారికి రిఫండ్ రెండుసార్లు అందిస్తున్నట్లు వెల్లడించింది. గతేడాది వచ్చిన ముందస్తు బుకింగ్‌లతో పోలిస్తే ఈ సారి ఐఫోన్ 16కి విశేష స్పందన లభించిందని, రెండింతలు బుకింగ్‌లు వచ్చాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. పలు క్రెడిట్ కార్డులపై రాయితీ కూడా ఇస్తున్నట్లు తెలిపింది.

వే2న్యూస్ 117 కోట్ల సేకరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 17: ప్రాంతీయ వార్తలు అందించే వే2న్యూస్ మరోసారి భారీ స్థాయిలో నిధులను సమీకరించింది. వెస్ట్‌బ్రిడ్జ్ క్యాపిటల్ నుంచి 14 మిలియన్ డాలర్లు(రూ.117 కోట్లు) సేకరించినట్లు కంపెనీ ఫౌండర్, సీఈవో రాజు వనపాల తెలిపారు. వ్యాపారాన్ని విస్తరించడానికి, బ్రాండ్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా ఈ నిధులను సేకరించినట్లు చెప్పారు. అలాగే వెంచర్ క్యాపిటలిస్ట్ శశి రెడ్డి కూడా పెట్టుబడులు పెట్టారు కూడా. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే.

నాలుగు నెలల కనిష్ఠానికి టోకు ధరల సూచీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: టోకు ధరల సూచీ శాంతించింది. వరుసగా రెండో నెల ఆగస్టులోనూ టోకు ధరల సూచీ నాలుగు నెలల కనిష్ఠ స్థాయి 1.31 శాతానికి పడిపోయింది. కూరగాయలు, ఆహార, చమురు ధరలు తగ్గుముఖం పట్టడం వల్లనే ధరల సూచీ తగ్గిందని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. జూలై నెలలో 2.04 శాతంగా ఉన్న ధరల సూచీ..ఏడాది క్రితం మైనస్ 0.46 శాతంగా ఉన్నది. ఆహారపదార్థాల ధరల సూచీ 3.11 శాతంగా ఉన్నది.

పారదర్శకంగా ఉండాలి

ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్‌కు ఐబీబీఐ చీఫ్ సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17: దివాలా ప్రక్రియలో ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ వీలైనంత పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చైర్మన్ రవీ మిట్టల్ అభిప్రాయపడ్డారు. అప్పుడే మొండి బకాయిల పరిష్కార బిడ్డింగ్‌లో ఎక్కువ మంది పాల్గొంటారని, దాంతో రుణాలిచ్చినవారికి మరింత సొమ్మును ఇప్పించగలమని చెప్పారు. మంగళవారం ఇక్కడ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్ ఆఫ్ ఐసీఏఐ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ఇన్సాల్వెన్సీ వ్యవస్థకు ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్, ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ సంస్థలే ఆధారం అన్నారు. దివాలా ప్రక్రియను వేగవంతం చేయాలని కూడా ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్స్‌కు సూచించారు. సమయాన్ని దృష్టిలో పెట్టుకొని జాప్యం లేకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దాంతో ఐబీబీఐపై విశ్వాసం పెరుగుతుందన్నారు.

కదం తొక్కుతున్న మార్కెట్లు

తొలిసారి 83 వేలపైన సెన్సెక్స్ • చారిత్రక గరిష్ఠ స్థాయికి సూచీలు

ముంబై, సెప్టెంబర్ 17: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న సెన్సెక్స్ మంగళవారం 83 వేల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ చరిత్రలో ఇంతటిస్థాయికి చేరుకోవడం ఇదేతొలిసారి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల పవనాలకు తోడు వడ్డీరేట్ల తగ్గింపునకు అమెరికా ఫెడరల్ మొగ్గుచూపే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు గ్లోబల్ మార్కెట్లు భారీగా లాభపడటంతో దేశీయ సూచీలు ఎగిశాయి. ఇంట్రాడేలో 160 పాయింట్లకు పైగా లాభపడి 83,152.41 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 90.88 పాయింట్లు అందుకొని చారిత్రక గరిష్ఠ స్థాయి 83,079.66 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం లైఫ్‌టైం హై 25,400 పాయింట్ల పైన ముగిసింది. చివరకు 34.80 పాయింట్లు ఎగబాకి 25,418.55 వద్ద స్థిరపడింది. స్టాక్ మార్కెట్లు పాజిటివ్‌లోనే కదలాడుతున్నాయని, ఫెడ్ వడ్డీరేట్లను పావుశాతం తగ్గించే అవకాశాలుండటం సూచీల్లో జోష్ పెంచిందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. అలాగే కూరగాయల ధరలు శాంతించడంతో ఆగస్టు నెలకుగాను టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోవడం కూడా కలిసొచ్చిందన్నారు.

- భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, మహీంద్రా షేర్లు లాభపడ్డాయి.
- అలాగే టైటాన్, ఎల్‌అండ్‌టీ, కొటక్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, బజాజ్‌ఫైనాన్స్, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, అల్ట్రాటెక్ సిమెంట్, రిలయన్స్ షేర్లు బలపడ్డాయి.
- టాటా మోటర్స్ షేరు 1.33 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది.
- దీంతోపాటు అదానీపోర్ట్స్, ఐటీసీ, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, పవర్‌గ్రిడ్, మారుతి, ఎస్బీఐ, టీసీఎస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే, యాక్సిస్ బ్యాంక్‌లు నష్టపోయాయి.

బజాజ్ హౌజింగ్ మరో 10 శాతం

నూతనంగా స్టాక్ మార్కెట్లో లిస్టైన బజాజ్ హౌజింగ్ షేరు కదంతొక్కుతున్నది. వరుసగా రెండోరోజు కూడా కంపెనీ షేరు 10 శాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో కంపెనీ షేరు 10 శాతం లాభపడి రూ.181.48 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ మరో రూ.13,733.12 కోట్లు పెరిగి రూ.1,51,139.21 కోట్లకు చేరుకున్నది. ఇష్యూ ధర రూ.70తో పోలిస్తే గత రెండు రోజుల్లో షేరు ధర 159.28 శాతం ఎగబాకింది. రూ.150 వద్ద బీఎస్ఈ, ఎన్ఎస్ఈ వద్ద లిస్టైనది తెలిసిందే.

ఈ ఏడాదంతా
ప్రీప్రొడక్షనే

మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న చిత్రం అప్‌డేట్ కోసం దేశం మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్నది. కానీ రాజమౌళి మాత్రం అవేం పట్టించుకోకుండా కామ్‌గా తన పనితాను చేసుకుంటూ పోతున్నారు. ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు గప్‌చుప్‌గా జరిగిపోతున్నాయట. ఫిల్మ్ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం రాజమౌళి ఈ ఏడాది మొత్తాన్నీ ప్రీప్రొడక్షన్ వర్క్‌కే కేటాయిస్తున్నారట. ఈ సినిమా షూటింగ్ మొదలయ్యేది వచ్చే ఏడాదే అని తెలుస్తున్నది. తొలి షెడ్యూల్ జర్మనీలో ఉండబోతున్నదట. ఈ షెడ్యూల్‌లోనే కొందరు విదేశీ నటులు కూడా భాగం కానున్నారని వినికిడి. 18వ శతాబ్దానికి చెందిన పీరియాడికల్ ఎపిసోడ్ ఈ సినిమాలో హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. అమెజాన్ ఫారెస్ట్ నేపథ్యం అంతా ఆ ఎపిసోడ్‌లోనే ఉంటుందట. దీనికోసం రాజమౌళి ప్రత్యేకమైన స్కెచ్‌లు గీయిస్తున్నారని వినికిడి. అరుదైన గిరిజన జాతికి సంబంధించిన రిఫరెన్స్‌లు ఈ సినిమాలో ఉంటాయట. త్వరలోనే వీటికి సంబంధించిన స్కెచ్‌లు, కాస్ట్యూమ్స్ ఫైనలైజ్ చేయనున్నారు. దీనికోసం వందలమంది జూనియర్ ఆర్టిస్టులకు ముందే ట్రైనింగ్ ఇచ్చి, వారిని సిద్ధం చేయనున్నారట. దాదాపు వెయ్యికోట్ల భారీ వ్యయంతో రూపొందనున్న ఈ సినిమాను దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

బంగ్లాను అమ్మక తప్పలేదు

'ఆస్తులు అంటే మనకు అవసరమైనప్పుడు అమ్ముకునేవి అని అర్థం. ముంబయి బాంద్రాలోని పాలి హిల్‌లో ఉన్న నా బంగ్లాను నేను అమ్మేసిన మాట నిజం. 32కోట్లకు దాన్ని అమ్మేశాను. అది నా వ్యక్తిగత విషయం. అదేం దేశ సమస్య కాదు' అంటూ నిర్మొహమాటంగా చెప్పేసింది బాలీవుడ్ భామ కంగనా రనౌత్. గత కొన్ని రోజులుగా తన బంగ్లా అమ్మేసినట్లు వస్తున్న వార్తలపై తాజా ఇంటర్వ్యూలో కంగనా స్పందించింది. 'నా 'ఎమర్జన్సీ' సినిమా విడుదల కావాల్సివుంది. ఆ సినిమా నిర్మాణం కోసం నా ఆస్తుల్ని తనఖా పెట్టాను. కానీ అది విడుదల కాలేదు. దాంతో 2017లో కొన్న ఆ బంగ్లాను అమ్మక తప్పలేదు' అంటూ వివరణ ఇచ్చింది కంగనా. ఈ ఇంటర్వ్యూలోనే వివాదాస్పద వెబ్ సిరీస్ 'ఐసీ 814:ది కాందహార్ హైజాక్' గురించి కంగనా మాట్లాడుతూ 'ఈ మధ్య ఓటీటీ కంటెంట్ చాలా దారుణంగా ఉంటుంది. వాటిని పిల్లలు చూస్తున్నారు. వారి మనసులు విషతుల్యం అయితే.. ఆ ప్రభావం భావిభారతం మీద పడుతుంది. అందుకే.. ఓటీటీలో విడుదలయ్యే సినిమాలు, సిరీస్‌లకు కూడా సెన్సార్‌షిప్ అవసరం. దాన్ని సాధించే దాకా నా పోరాటం ఆగదు' అంటూ చెప్పుకొచ్చింది.

కమర్షియల్ పంథాకు భిన్నంగా..

సూపర్‌స్టార్ రజనీకాంత్ తాజా చిత్రం 'వేట్టైయాన్' దసరాకు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే దక్షిణాదిన భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. తాజాగా ఈ సినిమా గురించి చిత్ర సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. కమర్షియల్ పంథాకు భిన్నంగా సామాజికాంశాలను చర్చిస్తూ దర్శకుడు జ్ఞానవేల్ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడని, 'జై భీమ్' తరహాలో సమాజాన్ని ప్రభావితం చేసే సినిమా ఇదని అన్నారు. 'ఈ కథ నన్ను ఆలోచింపజేసింది. సమకాలీన అంశాలను తనదైన శైలిలో చర్చిస్తూ వాటికి పరిష్కార మార్గాల్ని సూచిస్తూ దర్శకుడు ఈ కథ రాసుకున్నాడు. రజనీకాంత్ కెరీర్‌లో ఇప్పటివరకు వచ్చిన చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. కమర్షియల్ అంశాలకు దూరంగా ఓ బలమైన సందేశాన్ని అందించే ఉద్దేశ్యంతో రజనీకాంత్ ఈ సినిమాలో నటించారు' అని చెప్పారు. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, రానా, ఫాహద్ ఫాజిల్, మంజు వారియర్ ప్రధాన పాత్రల్ని పోషిస్తున్నారు. అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది.

మల్టీస్టారర్ జీబ్రా

సత్యదేవ్, కన్నడ నటుడు డాలీ ధనంజయ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మల్టీస్టారర్ 'జీబ్రా'. 'లక్ ఫేవర్స్ ది బ్రేవ్' అనేది ఉపశీర్షిక. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. అక్టోబర్ 31న దీపావళి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ మంగళవారం మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈ పోస్టర్‌లోనే రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. సత్యరాజ్, సత్య అక్కల, జెన్నిఫర్ పిసినాటో, సునీల్, ప్రియా భవానీశంకర్, డాలీ ధనంజయ, సత్యదేవ్‌లను ఈ పోస్టర్ పరిచయం చేసింది. కాయిన్ తిప్పడం, కరెన్సీ నోట్లు, ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నుంచి కారు దూకడం వంటి డైనమిక్ ఎలిమెంట్స్ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: సత్య పొన్మార్, సంగీతం: రవి బస్రూర్, సహనిర్మాత: ఎస్.శ్రీలక్ష్మిరెడ్డి, నిర్మాణం: పద్మజ ఫిల్మ్స్ ప్రై.లిమిటెడ్, ఓల్డ్‌టౌన్ పిక్చర్స్.

నాలుగోసారి దర్శకత్వం

స్వీయ దర్శకత్వంలో ధనుష్ నటించిన 'రాయన్' చిత్రం ఇటీవలే విడుదలై భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. నటుడిగా, దర్శకుడిగా ధనుష్ అద్భుతమైన ప్రతిభతో ప్రేక్షకుల్ని మెప్పించారు. ప్రస్తుతం ఆయన తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఇదిలావుండగా ధనుష్ మరోమారు మెగాఫోన్ పట్టబోతున్నారు. ఆయన దర్శకత్వంలో రూపొందబోతున్న నాలుగో చిత్రమిది కావడం విశేషం. నూతన నిర్మాణ సంస్థ డాన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. మంగళవారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. తనదైన శైలి యాక్షన్, ఎమోషనల్ అంశాలతో ధనుష్ అద్భుతమైన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని, దర్శకుడిగా ఆయనకు మరో విజయం ఖాయమని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది. ప్రస్తుతం ధనుష్ 'కుబేర' చిత్రంలో నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాగార్జున, రష్మిక మందన్న ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో త్వరలో విడుదలకానుంది.

ఆలోచించి అడుగు వేయండి

జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ మలయాళ సినీరంగాన్ని కుదిపేస్తున్నది. ఈ కమిటీ ప్రభావంతో ఇతర భాషల్లో కూడా లైంగిక వేధింపులపై విచారణ చేపట్టాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. డ్యాన్స్ మాస్టర్ జానీపై లైంగిక వేధింపుల కేసు నమోదు కావడం తెలుగు ఇండస్ట్రీలో సంచలనంగా మారింది. సినీ రంగంలో ఈ పరిణామాలపై కథానాయిక కృతిశెట్టి ఆందోళన వ్యక్తం చేసింది. ఆమె మాట్లాడుతూ 'ఈ తరహా సంఘటనలు జరగడం దురదృష్టకరం.బాధితులు అనుభవించిన మానసిక క్షోభను తలచుకుంటే భయమేస్తున్నది. అయితే ఇలాంటి సంఘటనల గురించి ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చేవారు ముందే తెలుసుకోవడం చాలా మంచిది. అప్పుడు వారికి ఇండస్ట్రీ పట్ల ఓ అవగాహన ఏర్పడుతుంది. దీనివల్ల భవిష్యత్తులో సానుకూల మార్పులు వస్తాయి' అని చెప్పింది. వ్యక్తిగతంగా ఇలాంటి విషయాలు తనను బాగా డిస్టర్బ్ చేస్తాయని, వేధింపుల వార్తలు విన్నప్పుడు ఆందోళన కలుగుతుందని కృతిశెట్టి చెప్పింది. ఇండస్ట్రీలోకి కొత్తగా వచ్చే మహిళలు ఆలోచించి అడుగులు వేయాలని ఆమె సలహా ఇచ్చింది. కృతిశెట్టి నటించిన తాజా చిత్రం 'ఏఆర్ఎమ్' బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధిస్తున్నది.

భక్తిప్రధానంగా కాశీనగర్

డీకే దిలీప్ రాథోడ్, ఆరోహి జంటగా రూపొందిన భక్తిప్రధాన చిత్రం 'కాశీనగర్-1947'. చిత్తజల్లు ప్రసాద్ దర్శకుడు. కదిరి రమాదేవిరెడ్డి నిర్మాత. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఈ సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్, దర్శక,నిర్మాత సాయివెంకట్, సుప్రీం కోర్ట్ న్యాయవాది ఎన్.రామచంద్రరావు, రిటైర్డ్ డీజీపీ సి.ఎన్.గోపీనాథరెడ్డి, కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కుటుంబసమేతంగా చూడదగ్గ గొప్ప సినిమా ఇదని దర్శకుడు తెలిపారు. దైవసంకల్పం వల్లే ఈ సినిమా చేయగలిగామని నిర్మాత పేర్కొన్నారు.

బాధితురాలికి అండగా ఉంటాం

'పని ప్రదేశాల్లో వేధింపులు ఉన్నాయంటూ బాధితురాలు ఛాంబర్‌ని ఆశ్రయించింది. మీడియాలో విషయం వెలుగుచూడగానే, లైంగిక వేధింపుల గురించి బయట పెట్టింది. మా పరిధిలో మేం విచారణ పూర్తి చేశాం. ఇద్దరి వాదనలు విన్నాం. 90రోజుల్లో దీనికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని రిపోర్ట్ చేస్తాం. ఇలాంటి వ్యవహారాలపై పరిశ్రమకు చెందిన ఎవరు కంప్లైంట్ చేసినా.. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం' అని టాలీవుడ్‌కి చెందిన లైంగిక వేధింపుల పరిష్కార ప్యానల్ అధ్యక్షురాలు ఝాన్సీ తెలిపారు. ప్రముఖ కొరియోగ్రఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైన విషయం విదితమే. ప్రస్తుతం నార్సింగ్ పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై టాలీవుడ్‌కు చెందిన లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఝాన్సీ మాట్లాడుతూ 'బాధితురాలు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు ఎదుర్కొన్నానని పేర్కొన్నది. ఈ ఒక్క విషయాన్నే కాకుండా, ఈ వ్యవహారంలో మరికొన్ని అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అందుకు వైద్యపరంగా, న్యాయపరంగా ఆ అమ్మాయి సహకరించాలి. ఆ అమ్మాయికి అండగా నిలవడానికి మా కమి